

గోదాం తరలిపోనుందా..?

ఆమదాలవలస గూడ్స్ గోదాం నిర్వహణపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. తరలి పోనుందనే వాదన వినిపిస్తోంది. - 8లో



శభాష్ మేజర్ కవిత

బ్రహ్మపుత్రపై డ్రాఫ్టింగ్ చేసిన ఏకైక మహిళగా కవిత రికార్డు సృష్టించారు. ఆమె సిక్కోలు ఆడపడుచు. - 8లో

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్జీల గురించి సమాచారం తెలుసుకోవాలంటే 1100 నంబర్‌కు నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

ఐసీడీఎస్ పీడీగా విమల



ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఐ.విమల

శ్రీకాకుళం అర్బన్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులుగా ఐ.విమల నియమితులయ్యారు. ఈమె ఆదివారం జిల్లా ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో కడప జిల్లా పోరుమామిళ్లలో సీనియర్ సీడీపీఓగా పనిచేశారు. ఐసీడీఎస్ పీడీగా పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం ఐసీడీఎస్ పీడీగా పనిచేసిన బి.శాంతిశ్రీతన మాతృసంస్థ అయిన కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం



గాయపడిన పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో ఆదివారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 12 మందిని కరిచింది. వీరంతా శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కొల్లివలస గ్రామానికి చెందిన సీర లక్ష్మినారాయణ, మేడిగిరి, గడే కిషోర్, గడే పార్వతి, పి.రమణమ్మ, మంతిని ఈశ్వరమ్మతో పాటు మరికొందరిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో వీరిని వెంటనే 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

టెక్కలిలో..

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం జర్జంగి పంచాయతీ పరిధి గుంజిలోవ గ్రామంలో ఆదివారం వేకువజామున పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం వేకువజామున గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై నడిచి వెళ్తుండగా వారిపై దాడిచేసింది. అలానే గ్రామంలో ఉన్న 9 ఆవులు, 4 ఎద్దులు, 3 పెయ్యలు కలిపి మొత్తం 16 పశువులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అనంతరం ఆ కుక్కసైతం మృతి చెందిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారులు గ్రామానికి చేరుకుని కుక్కదాడిలో గాయపడిన పశువులకు టీకాలు వేశారు.

'ఎయిర్ పోర్టుకు అంగుళం స్థలం ఇచ్చేది లేదు'




కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్: పచ్చని ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి అంగుళం స్థలం కూడా ఇవ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. తోటూరు గ్రామంలో శనివారం రాత్రి కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ ప్రాంతాన్ని విధ్వంసం చేసే ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నామని, ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ముందుకు వెళ్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, ఉపాధ్యక్షుడు ఎల్.రామస్వామి, కార్యదర్శి జోగి అప్పారావు, గుంట లోకనాథం, మద్దు జానకిరావు, ఎం.పురుషోత్తం, ధనరాజు, పి.నారాయణ, ఉప్పాడ దుర్గారావు, ఎస్.కృష్ణవేణి, జి.చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీకా..లేదుగా





ప్రభుత్వాస్పత్రులను టీకాల కొరత వేధిస్తోంది. పిల్లలకు వ్యాక్సిన్ వేయిద్దామని వచ్చే తల్లిదండ్రులకు వాయిదాల దండకం వినిపిస్తోంది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల పిల్లల వరకు పలు రకాల టీకాలు తప్పనిసరిగా సకాలంలో వేయించాలి. కానీ జిల్లాలో టీకాల కొరత కారణంగా రెండు నెలలుగా చాలా మంది పిల్లలకు వ్యాక్సిన్లు వేయలేదు.

- జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో లేని వ్యాక్సిన్లు
- రెండు నెలలుగా తీవ్రంగా వేధిస్తున్న కొరత
- పిల్లలకు వ్యాక్సిన్లు వేయించలేక తల్లిదండ్రుల పాట్లు

అరసవల్లి:

అప్పుడే పుట్టిన బిడ్డలకు ఓపీవీ జీరో వ్యాక్సిన్ వేయాలి.. కానీ జిల్లాలో అది అందుబాటులో లేదు. బీసీజీ వేయాలి.. అది కూడా లేదు. హెపటైటిస్–బి (బర్త్‌డోస్) ఎప్పుడు వస్తుందో తెలీదు. ఆరు వారాల నుంచి ఏడాది లోపు బిడ్డలకు ఓపీవీ–1 తప్పనిసరి. కానీ రెండు నెలలుగా ఇవి రాలేదు. ఎఫ్ఐపీ, రోటా వైరస్ వ్యాక్సిన్లు కూడా ఎక్కడా కనిపించడం లేదు. ఏడాదిన్నర నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు కోరింత దగ్గు, డిఫ్తీరియా, టెటానస్‌ల నుంచి రక్షణకు డీపీటీ బూస్టర్ వ్యాక్సిన్లు వేయాలి. కానీ ఎప్పుడూ నో స్టాక్ బోర్డు వెక్కిరిస్తూనే ఉంది. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో వ్యాక్సిన్ల కొరత తీవ్రంగా ఉంది. టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రి నుంచి నరసన్నపేట ఏరియా ఆస్పత్రి, కమ్యూనిటీ ఆస్పత్రులతో పాటు పీహెచ్‌సీల్లోనూ ఈ కొరత కనిపిస్తోంది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలిలోనే వ్యాక్సిన్లు లేవు. జిల్లాలో సర్వజన ఆస్పత్రి (శ్రీకాకుళం), జిల్లా ఆస్పత్రి (టెక్కలి), ఏరియా ఆస్పత్రి (నరసన్నపేట), 13 సీహెచ్‌సీలతో పాటు 71 పీహెచ్‌సీలు, 13 అర్బన్ పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటికి కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి వచ్చే వ్యాక్సిన్లను జిల్లా వ్యాక్సినేషన్ కేంద్రం నుంచి సరఫరా చేస్తారు. ఆయా ఆరోగ్య కేంద్రాల అధికారులు పంపిన ఇండెంట్ల ప్రాప్తికి వ్యాక్సిన్లను ప్రతి నెలా పంపిస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్య ధోరణి కారణంగా సకాలంలో మందుల నుంచి వ్యాక్సిన్ల సరఫరాల వరకు ఏవీ సవ్యంగా జరగడం లేదనే చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా ఇండెంట్లు పెడుతున్నా వ్యాక్సిన్లు మాత్రం రావడం లేదు. నేషనల్ ఇమ్యూనైజేషన్ షెడ్యూల్ ప్రకారం అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల అమ్మాయిలు, గర్భిణులకు కూడా వ్యాక్సిన్లు షెడ్యూల్ ప్రకారం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం రెండు నెలల నుంచి జిల్లాలో జిల్లా ఆస్పత్రి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు ఎక్కడా వ్యాక్సిన్లు అందుబాటులో లేకుండా పోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టి సారించి వ్యాక్సిన్ల కొరత సమస్యలను పరిష్కరించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

త్వరలో సరఫరా జరిగేలా చర్యలు



జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ ఇచ్చిన వివరాల మేరకు గత రెండు నెలల నుంచి కొన్ని వ్యాక్సిన్లు మాత్రం సరఫరా జరగలేదన్న సంగతి నా దృష్టికి వచ్చింది. అయితే వ్యాక్సిన్లు అన్నీ కేంద్రం ఇవ్వాల్సి ఉంది. కొరత ఉన్న వ్యాక్సిన్లను త్వరలోనే జిల్లాలో అన్ని ఆస్పత్రులకు సరఫరా అయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ అనిత, డీఎంహెచ్ఓ

రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు



వసప సమీపంలో వంశధార నది వద్ద అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- అక్రమ ఇసుక తవ్వకాలు అరికట్టాల్సిందే
- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- వంశధారలో అక్రమ ఇసుక తవ్వకాల పరిశీలన

కొత్తూరు: కొత్తూరు మండలం వసప గ్రామ సమీపంలోని వంశధార నదిలో బలద ఇసుక ర్యాంపు పేరుతో నిర్వహిస్తున్న ర్యాంపులో అక్రమ తవ్వకాలు అరికట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపుతో పాటు స్టాక్ పాయింట్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న దారిలో ఆమె ప్రయాణించి ర్యాంపు వరకు చేరుకుని తవ్వకాలు పరిశీలించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని, ఒడిశాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. ఇసుక కోసం నదికి అడ్డంగా గట్టు కట్టడం దారుణమని, రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాలతో సుమారు మూడు మీటర్ల లోతులో తవ్వకాలు చేస్తే.. వరదలు వచ్చినప్పుడు వసప, కుంటిబద్ర కాలనీ, నివగాంతో పాటు పలు గ్రామాలు మునిగిపోతాయని తెలిపారు. పొలాల మీదుగా ఈ ర్యాంపునకు దారి వేశారని, దీని వల్ల పంటలు తీసుకువచ్చే రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై ప్రశ్నిస్తున్న వారిని బెదిరిస్తున్నారని రెడ్డి శాంతి తెలిపారు. తవ్వకాలు ఆపకపోతే నేషనల్ గ్రీన్ ట్రిబునల్‌కు (ఎన్‌జీటీ)కు ఫిర్యాదు చేస్తానన్నారు. ర్యాంపు వద్దకు రెడ్డి శాంతి వచ్చారన్న విషయం తెలియడంతో స్థానిక రైతులంతా ఆమె వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకున్నారు.

నిర్వాహకులను అడిగితే కేసులు పెడతామని భయపెడుతున్నారని కామయ్య జగదీష్, చినరాయుడుతో పాటు పలువురు రైతులు రెడ్డి శాంతికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ పాతపట్నం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు, జగదీ ష్, సర్పంచ్‌లు ధర్మారావు, బాలకృష్ణ, సాధుబాబు, వైకుంటరావు, సేపాన అశోక్ కుమార్, సింహాద్రి, ఎంపీటీసీ వనుము లక్ష్మినారాయణ, ఎ.నాగేశ్వరరావు రమేష్, నగేష్, యతిరాజు, నాగరాజు, ఆఫీస్, వాసు, అశోక్, లింగం పాల్గొన్నారు.







బావిలోనుంచి వృద్ధురాలిని బయటకు తీస్తున్న దృశ్యాలు



సపర్యలు చేస్తున్న గ్రామస్తులు

రాత్రంతా బావిలోనే..

చిమ్మచీకటిలో... మనుషుల అలికిడి లేని చోట.. కేకలు వేస్తే వినిపించని ప్రాంతంలో.. చుట్టూ ఉన్న నీరు బతుకును బలికోరుతున్న సమయాన.. ఓ వృద్ధురాలు ప్రాణాలు కాపాడుకున్నారు. రాత్రంతా బావిలో ఉండిపోయారు. ఈ ఘటన పట్టుపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు..

పొట్నూరు లోకేశ్వరరావు జీడి మామిడి తోటలో ఉన్న బావి వద్ద ఆదివారం సాయంత్రం చెప్పులు ఉండడాన్ని కొందరు గ్రామస్తులు గమనించారు. దగ్గరకు వెళ్లి చూడగా ఓ డబ్బై ఏళ్ల మహిళ బావి లోపల రాళ్లను పట్టుకుని ఓ మూలన కనిపించింది. దీంతో వారు వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో స్థానికులు తామాడ భాస్కరరావు, ఎస్.వెంకటరావు హుటాహుటిన బావి వద్దకు వెళ్లి మెళియాపుట్టి గ్రామానికి చెందిన రేఖాన ఢిల్లి అనే వ్యక్తి సాయంతో ఆమెను బయటకు తీసి పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతరం చాపర పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె పేరు లక్ష్మి అని, ఊరు శ్రీకాకుళం అని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఆమెకు మతిస్థిమితం లేదని, రాత్రి బావిలో పడిపోయి ఉంటుందని స్థానికులు తెలిపారు.

– మెళియాపుట్టి



ఆకాశం అందుకుందాం..

- పేద విద్యార్థులకు పైలెట్ శిక్షణ
- బోయింగ్ సంస్థ, లెర్నింగ్ లింక్స్ నేతృత్వంలో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్ నిర్వహణ
- జిల్లాలో టెక్కలి, వెన్నెలవలసలో ల్యాబ్‌లు ఏర్పాటు

టెక్కలి:

పేద విద్యార్థులు ఆకాశాన్ని అందుకోవడానికి అపూర్వ అవకాశం వచ్చింది. పైలెట్ కావాలనే ఆకాంక్ష, ఆసక్తి కలిగిన నిరుపేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విమాన తయారీ సంస్థ బోయింగ్, ఢిల్లీకి చెందిన లెర్నింగ్ లింక్స్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌లను ప్రారంభించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస జవహర్ నవోదయ పాఠశాలల్లో మాత్రమే ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నుంచే శిక్షణ తరగతులు ప్రారంభించారు. వీటి ద్వారా టెక్కలి బాలికోన్నత పాఠశాలలో 710 మందికి, వెన్నెలవలస నవోదయ పాఠశాలలో 465 మంది శిక్షణ అందజేస్తున్నారు. ఢిల్లీలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'ఫెసిలిటేటర్'తో రెండు పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు.

పైలెట్‌ల కొరత రాకుండా..

భవిష్యత్‌లో ఏవియేషన్ రంగంలో పైలెట్‌ల కొరత లేకుండా ఉండేందుకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల కోసం ముఖ్యంగా బాలికలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్, విభిన్నమైన ఆలోచనలు, సమస్యల పరిష్కారం, సహకారం, టీమ్ స్ఫూర్తి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఆయా అంశాల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తారు. అంతే కాకుండా ఈ ల్యాబ్ ద్వారా అడ్వాన్స్ ఎలక్ట్రానిక్స్, సెన్సార్స్, సర్వో మోటార్స్, మెకానికల్, ర్యాపిడ్ ఫొటో టైపింగ్, త్రీడీ ప్రింటింగ్, ఫ్లూటో డ్రోన్స్, ట్రాన్స్‌మీటర్స్, రిసీవర్స్, ఏవియేషన్ సాంకేతిక అంశాలతో శిక్షణ ఇస్తారు.



బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌లో రాకెట్ క్రాఫ్ట్స్‌తయారు చేసి ఎగురవేస్తున్న విద్యార్థినులు

పైలెట్ కావాలనుకుంటున్నా..



నాకు పైలెట్ కావాలనే కోరిక ఉండేది. అయితే ఎలా చదవాలి, ఎక్కడ శిక్షణ తీసుకోవాలి అనే విషయం తెలియని పరిస్థితిలో ఈ ల్యాబ్ నాలాంటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– సీహెచ్ రజని, విద్యార్థిని, బాలికోన్నత పాఠశాల, టెక్కలి

విద్యార్థులకు చక్కటి అవకాశం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్ చక్కటి అవకాశం. మా పాఠశాలను ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ముఖ్యంగా పైలెట్ కావాలనే కోరిక ఉన్న విద్యార్థులు ఈ ల్యాబ్ ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు.

– ఎస్.శోభారాణి, ప్రధానోపాధ్యాయురాలు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, టెక్కలి.

పైలెట్‌గా మారుస్తాం



కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో బోయింగ్ సంస్థ, లెర్నింగ్ లింక్స్ సంస్థ ద్వారా బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఒక్క శ్రీకాకుళం జిల్లాలో రెండు చోట్ల మాత్రమే వీటిని ఏర్పాటు చేశారు. ఢిల్లీలో మాకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అన్ని రకాల శిక్షణలు అందజేసి, ఇంటర్ స్థాయిలో పైలెట్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పైలెట్‌గా మారుస్తాం. – ఎ.సాయికుమార్, బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్ ఫెసిలిటేటర్

అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

పోలాకి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డీఎస్పీ శాంతారావు అంత్యక్రియలు ఆయన స్వగ్రామం డోలలో ఆదివారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తోపాటు పలువురు రాజకీయ నాయకులు, బంధువులు, స్థానికులు హాజరై నివాళులర్పించారు. ఎస్ఐ రంజిత్ సమక్షంలో పోలాకి మండల కేంద్రం నుంచి డోల వరకు ట్రాఫిక్‌ను క్లియర్ చేసి బందోబస్తు చేపట్టారు. ఎస్పీతో సహా అక్కడకు వచ్చిన పోలీసులంతా ఆయనకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ డోలలో డీఎస్పీ జల్లు శాంతారావు కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. శాంతారావు కుమారులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఎల్ఐసీ ఏజెంట్ ఎన్ని రమణ కుటుంబాన్ని కృష్ణదాస్ పరామర్శించారు. ఆయనతోపాటు మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, పార్టీ నాయకులు డోల సాయిరాం తదితరులు ఉన్నారు.



డీఎస్పీ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి



డీఎస్పీ కుటుంబానికి ధైర్యం చెబుతున్న ధర్మాన కృష్ణదాస్

31న రిటైర్‌మెంట్.. నేడు విచారణ

- కుప్పిలి మాస్ కాపీయింగ్ ఘటనలో డీఈఓపై నేడు విచారణ
- విచారణ అధికారిగా డీజీ శ్రీనివాసులురెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యపై అనూహ్యరీతిలో విచారణ జరగబోతోంది. ఆయన ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ చేయనుండగా.. ముచ్చటగా మూడు రోజులకు ముందు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 2025 మార్చి 21వ తేదీన పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఎచ్చెర్ల మండల పరిధిలోని కుప్పిలి మోడల్ స్కూల్‌లో మాస్ కాపీయింగ్ జిల్లావ్యాప్తంగా సంచలనమైంది. ఈ ఉదంతంలో 15మంది టీచర్లను సస్పెండ్ చేశారు. ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశారు. అయితే ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. డీఈఓకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాయి. టెన్త్ స్పాట్ చేయబోమని హెచ్చరించాయి. దీంతో ఉపాధ్యాయుల సస్పెన్షన్లను వెనక్కి తీసుకున్నారు. కమిటీ వేసి నివేదిక ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించి, స్పాట్ వాల్యుయేషన్‌ను పూర్తిచేశారు. ఆ విచారణ ఇన్నాళ్లకు జరగబోతోంది. ఉపాధ్యాయులపై ఉన్న పెండింగ్ చార్జీలను, క్రిమినల్ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక శ్రీకాకుళం జిల్లా కమిటీ ముఖ్య ప్రతినిధులు మజ్జి మదన్‌మోహన్, చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, దుప్పల శివరాం ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.



డీజే

డీజే మోత.. పెడితే వాత

- డీఆర్‌వలసలో డీజేలు పెట్టకూడదని తీర్మానం
- శుభ కార్యక్రమాలకు డీజేలు పెడితే జరిమానా

జి.సిగడాం:

ఊరిలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా డీజేలు పెట్టడం పరిపాటిగా మారిపోయింది. పుట్టిన రోజు నుంచి షష్టి పూర్తి వరకు అన్నింటా డీజే బీట్లు వినిపిస్తున్నాయి. కానీ జి.సిగడాం మండలంలోని దాలెమ్మ రాజువలస(డీఆర్ వలస) డీజేలకు స్వస్తి చెప్పాలని నిర్ణయించుకుంది. గ్రామంలో జరిగే ఏ కార్యక్రమంలోనూ ఇకపై డీజేలు వాడకూడదని వారు ఏకంగా దేవుడి గుడిలో ఈ నెల 20న అంతా కలిసి తీర్మానం చేసుకున్నారు. ఈ తీర్మానాన్ని మీరి ఎవరైనా డీజే ఏర్పాటు చేస్తే జరిమానా విధించడంతో పాటు పోలీసు కేసులు పెడతామని హెచ్చరించారు.



డీఆర్‌వలసలో డీజే వాడవద్దని రామమందిరంలో తీర్మానం చేస్తున్న గ్రామ పెద్దలు

ఎందుకు వద్దంటే..

డీజేల మోతతో గుండె జబ్బులు, ఇతర సమస్యలు ఉన్న వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు గుర్తించారు. డీజేలు పెట్టినప్పుడు ఇంటిలోఉన్న సామాన్లు కూడా చిందరవందరగా మారుతున్నాయని, ఇది ప్రాణాంతకంగా మారుతోందని వారంటున్నారు. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకునే డీజేలు వాడకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

తీర్మానం చేసుకున్నాం



గ్రామంలో ఎవరూ డీజేలు పెట్టకూడదని రామ మందిరంలో తీర్మానం చేసుకున్నాం. పెద్దల మాట కాదని ఎవరైనా డీజేలు పెడితే ఆ బాధ్యత ఆ శుభకార్యం చేసిన వారిదే.

– కుమరాపు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ, డీఆర్‌వలస

పెద్దల ఆలోచన మేరకే..



గుండె జబ్బులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని దృష్టిలోఉంచుకుని గ్రామ పెద్దల ఆలోచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం. శుభకార్యక్రమాలకు డీజే బదులుగా బ్యాండులు, ఇతర మేళాలు ఏర్పాటు చేసుకోవాలి. – కుమరాపు శ్రీనివాసరావు, సర్పంచ్, డీఆర్‌వలస

క్లుప్తంగా

షిర్డీసాయి ఆలయంలో చోరీ



ఆలయంలో చోరీ జరిగిన దృశ్యాలు

శ్రీకాకుళం రూరల్: పెదగనగళ్లవానిపేట పంచాయతీ గాంధీనగర్ కాలనీలో షిర్డీసాయిబాబా ఆలయంలో రెండు రోజులు కిందట చోరీ జరగగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి రెండు జతల వెండి కిరీటాలు, వెండి పాదాలు, దీపం కుందెలు పట్టుకుపోయారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.43,500 ఉంటుందని ప్రాథమిక అంచనా వేసారు. రూరల్ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షల పరిశీలన



పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ

ఎచ్చెర్ల : చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణను జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు ఆదివారం పర్యవేక్షించారు. జూలై 27 నుంచి ఆగస్టు 1 వరకూ రెండు విడతలుగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శ్రీశివానీ కాలేజీలో మొదటి రోజు జరిగిన పరీక్షకు 190 మంది అభ్యర్థులకు గాను 163 మంది హాజరయ్యారు. డీఆర్‌వోతోపాటు ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి భోగేశ్వరి, పద్మప్రియ, హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్ జోగారావు పర్యవేక్షించారు.

తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం



ధనరాజు మృతదేహం

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు సముద్రతీరానికి ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం చేరింది. అక్కుపల్లి గ్రామానికి చెందిన మద్దు ధనరాజు కొంత కాలంగా మానసిక సమస్యలు, ఫిట్స్‌తో బాధపడుతున్నారు. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. ఈ క్రమంలో సముద్రంలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఆదివారం నువ్వలరేవు తీరానికి మృతదేహం చేరడంతో సోదరుడు వాసు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ధనరాజు తల్లిదండ్రులు 18 ఏళ్ల క్రితం మృతి చెందడంతో సోదరి హైమా వద్ద ఉంటున్నాడు.

అంబులెన్స్‌కు ప్రమాదం



ఘటనా స్థలంలో అంబులెన్స్

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఓ అంబులెన్స్ రోడ్డు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్‌కు చెందిన అంబులెన్స్ పలాస వచ్చి తిరిగి వెళ్తుండగా చాకిపల్లి కొత్తూరు సమీప జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకనే వస్తున్న అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

గూడ్స్ గోదాం.. తరలిపోనుందా?

- ఆమదాలవలస నుంచి దూసికి మార్చేందుకు సన్నాహాలు
- ఆందోళన చెందుతున్న గోదాం కలాసీలు
- సుమారు 800 కుటుంబాలపై ప్రభావం



శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ గూడ్స్ గోదాం వద్ద నిరసన తెలుపుతున్న కలాశీలు

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ ఆవరణలో సుమారు 60 ఏళ్ల కిందట ఏర్పాటైన గూడ్స్ గోదాం ఇక కనుమరుగు కానుందా? ఇక్కడి నుంచి దూసి రైల్వేస్టేషన్‌కు గోదాం తరలిపోనుందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు తమకు సమాచారం ఇచ్చారని గోదాం కలాసీలు చెబుతున్నారు. ఇదే జరిగితే తాము కుటుంబాలతో సహా రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఈ గోదాం వద్ద పెసలు, మినుములు,, జ్యూట్ వ్యాపారం జరిగేది. అనంతరం యూరియా, బియ్యం, ఐరన్ వంటి సరుకులను గూడ్స్ వేగన్‌లలో ఇక్కడ అన్‌లోడ్ చేసే పనిమొదలైంది. ఈ పని కోసం ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్ మండలాల్లోని ఊసవానిపేట, గేదెలవానిపేట, పాత ఆమదాలవలస, గేటు, పొన్నాం, నవనంబాడు, కుద్దిరాం, గొల్లపేట, అక్కివలస, పంతులపేట, మెట్టక్కివలస తదితర 20 గ్రామాల నుంచి సుమారు 400 కుటుంబాల కలాసీలు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు గోదాముకు చేరుకున్న వేలాది బస్తాలను లారీల్లోకి వేసి జిల్లా వ్యాప్తంగా సరుకులు రవాణా చేస్తున్నారు. రవాణా రంగంలో లారీ డ్రైవర్, క్లీనర్, ఓనర్లు సుమారు 400 మంది వరకు ఉంటారు. మొత్తమ్మీద ఈ గోదాములపై ఆధారపడి ప్రతిరోజూ 800 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.



గూడ్స్ గోదాం, వ్యాగిన్ నుంచి ఎరువుల బస్తాలు దించుతున్న కలాసీలు

అమృత్‌భారత్‌లో భాగంగా..

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమృత్‌భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద కోట్లాది రూపాయల వ్యయంతో శ్రీకాకుళం (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లోనూ పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్టేషన్ ఆవరణలో ఉన్న గూడ్స్ గోదామును ఆమదాలవలస పక్క రైల్వేస్టేషన్ ఉన్న దూసి రైల్వే స్టేషన్ ఆవరణలోకి మార్చేందుకు రైల్వే అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి భువనేశ్వర్ నుంచి డీపీఆర్ కూడా తయారుచేసి శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌కు పంపించినట్లు తెలిసింది. ఈ మేరకు స్టేషన్ అధికారులు గూడ్స్ గోదాం ముఖ్య కాంట్రాక్టర్లకు సైతం విషయం తెలియజేసినట్లు సమాచారం. వారు ఆ విషయాన్ని కలాసీలకు చెప్పడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. గోదాం తరలింపు ప్రయత్నాలు మానుకోవాలని, లేదంటే ఉద్యమం తప్పదని కలాసీలు చెబుతున్నారు.

రోడ్డున పడతాం..



గోదామును తరలిస్తే సుమారు 800 కుటుంబాలు జీవనాధారం లేక రోడ్డున పడతాయి. రైల్వే ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు ఆలోచించి తరలింపు యోచన విరమించుకోవాలి. ఇప్పటికే ఆమదాలవలసలో సుగర్ ఫ్యాక్టరీ, కాస్‌కాస్ట్ ఫ్యాక్టరీలు మూసి వేయడంతో ఉపాధి కరువైంది. – నీలంశెట్టి రాంబాబు, గూడ్స్ గోదాం కలాసీ మేస్త్రి, ఊసవానిపేట

పునరాలోచించాలి..



మా తాతల నుంచి ఇక్కడే పని చేసుకుంటున్నాం. అహర్నిశలు కష్టపడుతున్న మాకు గోదాం లేకుండా చేస్తామని చెప్పడం అన్యాయం. అలాంటి చర్యలు వెనక్కి తీసుకోవాలి. గోదాం తరలింపు యోచన మానుకోకపోతే ఎటువంటి పోరాటం చేయడానికైనా వెనుకాడబోం. – నీలంశెట్టి అప్పలనాయుడు, సీనియర్ కలాసీ, గూడ్స్ గోదాం

పొట్టకొట్టొద్దు...



ఈ పనినే నమ్ముకొని బతుకుతున్నాం. ఏళ్ల తరబడి బస్తాలు మోతకు అలవాటు పడ్డాం. గోదాం తరలించి మా పొట్టలు కొట్టొద్దు. ప్రస్తుతం బయట పనులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇక్కడైతే నిత్యం పనిదొరుకుతుంది. మూడుపూటలా మా కుటుంబాలకు భోజనం దొరుకుతుంది. – తోట ఆదినారాయణ, కలాసీ, గేదెలవానిపేట

నిలుపుదల చేయాలి



ఆమదాలవలస నుంచి గోదామును దూసి రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు రైల్వే ఉన్నతాధికారులు డీపీఆర్ సిద్ధం చేసి విడుదల చేశారు. ఇదే అమలైతే వందలాది మంది కళాసీలకు బతుకుతెరువు పోతుంది. కలాసీల పోరాటానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. – బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

ఉద్యమానికి సిద్ధం..



ఆమదాలవలస నుంచి గూడ్స్ గోదాం తరలించేందుకు చర్యలు చేపట్టడం సిగ్గుచేటు. ఇది స్థానిక ఎమ్మెల్యే, కూటమి నాయకుల చేతకానితనానికి నిదర్శం. స్థానికంగా ఉన్న వందలాది మంది ఉపాధి దెబ్బకొట్టడం సమంజసం కాదు. కలాసీల తరఫున ఎటువంటి ఉద్యమం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం. – తమ్మినేని చిరంజీవినాగ్, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ఆమదాలవలస

● పరిసరాలు ఇలా.. రోగాలు రావా?



జగన్నాథవలస పాఠశాల చుట్టూ నిలిచిన మురుగునీరు



ప్రధాన రహదారిలో నిల్వ ఉన్న వర్షపు నీరు

జి.సిగడాం మండలం జగన్నాథవలస ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ మురుగునీరు పేరుకుపోయింది. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనా నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – జి.సిగడాం

టీడీపీ అసమ్మతి వర్గంలో 'కళా'!

- అరసవల్లి ఆదిత్యున్ని దర్శించుకున్న కళా వెంకట్రావు
- హాజరైన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి, సీనియర్ నాయకులు



కళా వెంకట్రావుకు జ్ఞాపిక అందిస్తున్న అర్చకులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టీడీపీ నేతలు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీలో ఉన్న కొందరు అసమ్మతి నాయకుల ముఖాలు కళకళలాడుతున్నాయి. చీపురుపల్లి శాసనసభ్యుడు కళా వెంకట్రావును త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో మంత్రిని చేస్తారన్న ప్రచారమే ఇందుకు కారణం. శ్రీకాకుళం జిల్లాలో తొలి నుంచి తెలుగుదేశంలో రెండు ప్రధాన వర్గాలు ఉన్న విషయం బహిరంగ రహస్యం. ఓ వర్గానికి కింజరాపు కుటుంబీకులు, మరో వర్గానికి కళా వెంకట్రావు ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ విషయానికి వస్తే మాజీ శాసన సభ్యులు గుండ అప్పల సూర్యనారాయణ, గుండ లక్ష్మి దేవి దంపతులు కింజరాపు కుటుంబంతో ఉన్న అభిప్రాయ బేధాల వల్ల కళా వర్గంలో కొనసాగుతూ వచ్చారు. గత ఎన్నికల్లో గుండ దంపతులకు టికెట్ రాకుండా అడ్డుకున్నది కింజరాపు కుటుంబమేనని భావిస్తూ గుండ దంపతులు రగిలిపోతున్నారు. కొన్నేళ్లుగా కళా వెంకట్రావు స్తబ్దతగా ఉంటూ వస్తున్నారు. ఆయన శ్రీకాకుళం జిల్లాలో కాకుండా విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ఆయన సైతం కింజరాపు కుటుంబంపై గుర్రుగా ఉన్నారు. కళా వెంకట్రావుకు తొలి విడతలోనే మంత్రి పదవి ఇస్తారని భావించినప్పటికీ అది జరగలేదు. తాజాగా మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని, కళాకు తప్పకుండా మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం కుటుంబ సమేతంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకోవడం, ఆయన్ను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మరికొందరు సీనియర్ నాయకులు కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రానున్న రోజుల్లో ఇది ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

శభాష్ మేజర్ కవిత

- రాష్ట్ర గవర్నర్ అభినందనలు అందుకున్న సిక్కోలు మేజర్
- బ్రహ్మపుత్ర నదిపై రాఫ్టింగ్ యాత్ర చేసిన ఏకైక మహిళగా రికార్డు



కుటుంబ సభ్యులతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ముచ్చటిస్తున్న మేజర్ కవిత

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాకు చెందిన మేజర్ కవిత వాసుపల్లి చేసిన ఎన్నో ధైర్య సాహసాలు యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయి. జమెట్టూరు గ్రామానికి చెందిన కవితను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. వీఎస్ఎమ్, సాహసం మరియు సేవా రంగాలలో అసాధారణ ఘనత సాధించిన ఈమె ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. సాధారణ కుటుంబంలో జన్మించిన వాసుపల్లి కవిత చదువుల సరస్వతిగా కీర్తిగడించింది. శ్రీకాకుళం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, 2021లో భారత సైన్యంలో వైద్యురాలిగా చేరింది. తన కుటుంబాన్ని ఆదుకోవడమే కాక, దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో.. కేవలం నాలుగేళ్లలో నిబద్ధత కలిగిన వైద్యాధికారిణిగానే కాకుండా.. నాయకత్వం మరియు సాహసానికి చిహ్నంగా ఎదిగారు. మౌంట్ గోరిచెన్ ఎక్కే సమయంలో, 5,900 మీటర్ల ఎత్తులో స్పృహ కోల్పోయిన సహయాత్రికుడిని ఆమె రక్షించారు. ఆమె మేధస్సు, ధైర్యానికి భారతసైన్యం ఫిదా అయింది. ఇటీవల బ్రహ్మపుత్ర నదిపై 1,040 కిలోమీటర్ల రాఫ్టింగ్ యాత్రను పూర్తి చేసిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించింది. ఈ ఘనతకు ఆమె పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లో నమోదైంది. ఈ యాత్రను నిమాస్ డైరెక్టర్, శౌర్య చక్ర గ్రహీత, మౌంట్ ఎవరెస్ట్‌ను మూడు సార్లు అధిరోహించిన మొదటి భారతీయుడు కల్నల్ రణవీర్ సింగ్ జామ్‌వాల్, ఎస్ఎమ్, వీఎస్ఎమ్ నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌ను కవిత ఆదివారం కలిశారు. 'మేజర్ కవిత కథ అద్భుతమైన సంకల్పాన్ని చూపిస్తోంది. ఆమె ఆంధ్రప్రదేశ్‌కు , ప్రతి భారతీయుడికీ గౌరవాన్ని తీసుకువచ్చారు.. నీ రాష్ట్రానికి, దేశానికీ మరింత గౌరవం తీసుకురావాలి,'' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు.

లక్ష్యం ఎవరెస్ట్

'బ్రహ్మపుత్ర అద్భుతంగా ఉంది కానీ దయలేని నది. అనేక సార్లు, అతి పెద్ద అలలు మన రాఫ్ట్‌ను తిప్పేశాయి. ఆ క్షణాల్లో, మేమంతా నీటిలో మునిగి, బతికేం లేదా అనే అనుమానంలో పడ్డాం. అయినా భయపడకుండా లక్ష్యం చేరుకున్నాం. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో కొనసాగాలనుకుంటున్నాను. మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాలనే లక్ష్యం ఉంది. గవర్నర్‌ను కలవడం చాలా సంతోషంగా ఉంది. –డాక్టర్ మేజర్ కవిత వాసుపల్లి, ఇండియన్ ఆర్మీ వైద్యురాలు

ఆదిత్యా నమోస్తుతే!



ఆదిత్యుని దర్శనాలకు వెళ్తున్న భక్తులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాస మొదటి ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఈవో ప్రసాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉచిత మంచినీటిని పంపిణీ చేయించారు. పలువురు భక్తులు కేశఖండనశాలలో తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక తులసీదళాలతో ఆదిత్యుని మూల విరాట్టును అలంకరించి భక్తుల సర్వదర్శనాలకు ఉదయం 6 గంటల నుంచే అనుమతించారు. విశిష్ట, ప్రత్యేక దర్శనాలతో పాటు ఉచిత దర్శనాల క్యూలైన్లలోనూ భక్తులు బారులు తీరారు.

ఆదిత్యుని సన్నిధిలో డ్రాట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ది డెబ్ట్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్ (డ్రాట్-కోల్‌కత్తా) జస్టిస్ అనిల్‌కుమార్ శ్రీవాత్సవ్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాలతో అనివెట్టి మండపంలో స్వామి వారి శేషవస్త్రాలను కప్పి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. ఆలయ విశిష్టతను, స్వామి వారికి జరుగుతున్న సేవల వివరాలను శంకరశర్మ వివరించారు.

పేకాట శిబిరాలపై దాడి

కొత్తూరు: మండలంలోని నీలకంఠాపురం సమీపంలో కొండ దిగువ భాగంలో ఉన్న తోటల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు వేర్వేరుగా పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పట్టుకుని వారి నుంచి రూ.78 వేలు, రెండు బైక్‌లు, ఐదు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎండీ అహ్మద్ అలీ సిబ్బందితో నిర్వహించిన దాడిలో నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.75 వేలు, బైక్, కారు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. పేకాటరాయుళ్లపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

● అంబరాన్నంటిన సంబరం



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా గ్రామాలకు చెందిన భక్తులు సంబరాలు పేరిట మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణలు, కోయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. – ఇచ్ఛాపురం రూరల్

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా, హుషారుగా సాగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అండర్–14, 16, 18, 20 నాలుగు వయో విభాగాల్లో రన్స్, త్రోస్, జంప్స్ ఈవెంట్స్‌లో సత్తాచాటారు. వచ్చే నెల 9 నుంచి 11 వరకు చీరాలలో జరగనున్న రాష్ట్రపోటీలకు విజేతలను పంపిస్తారు. క్రీడాకారుల ట్రాక్ రికార్డు బట్టి తుది జాబితాను ప్రకటిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, కె.మాధవరావు, కె.హరిబాబు, తవిటయ్య, శ్రీనివాసరావు, ఆనంద్, మురళి, పద్మనాభరెడ్డి, గోవింద్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు. –శ్రీకాకుళం న్యూకాలనీ



క్రీడాకారులకు సూచనలిస్తున్న నిర్వాహకులు



జావెలిన్ విసురుతూ..



400 మీటర్ల పరుగులో దూసుకెళ్తున్న బాలికలు